
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్టం : 36.0 - కనిష్టం : 25.0

తణుకు : 36.0 - 25.0

వెంటాడుతున్న వాన

- రోడ్లపై బరకాలతో ధాన్యం రాశులు
- అన్నదాతకు తప్పని ఇబ్బందులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6: మెట్ట ప్రాంత రైతులను వర్షం వెంటాడుతోంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం మండలంలోని వీరంపాలెం, కొమ్ముగూడెం, వెంకట్రావుపాలెం, మోదుగగుంట, మాధవరం గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షాలకు రైతులు ధాన్యం తడవకుండా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం తడిస్తే అమ్మకానికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.



మాధవరంలో ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు



అమ్మా.. నమోస్తుతే

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం పలు అలంకరణల్లో అమ్మవార్లు దర్శనం ఇచ్చారు. పెనుగొండ శ్రీవాసవి శాంతి ధామ్ క్షేత్రంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా, కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు.





దళారుల గుప్పెట్లో ఇసుక బుకింగ్

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : ఇసుక విక్రయాల్లో ఆన్‌లైన్ మాయాజాలం ఉంటోందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొన్ని సమయంల్లోనే ఆన్‌లైన్ వెబ్ సైట్ అందుబాటులోకి వస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రమే ఇసుక రీచ్‌లు పనిచేస్తున్నాయి. గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేస్తున్నారు. రోజంతా తవ్వకాలు నిర్వహించి నిల్వలను లెక్కలు కడుతున్నారు. ఆ తరువాత ఆన్‌లైన్ ద్వారా అవకాశాలు కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ సమయం బుకింగ్ సమయం బ్రోకర్లు తెలుసుకోకలుగుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 400కు పైగా వాహనాలు ఉన్నాయి. బ్రోకర్లు అక్కడ రాజ్యం ఏలుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వారి దందానే సాగింది. అప్పట్లో విరివిగా తవ్వకాలు జరగడంతో ఇసుకకు డిమాండ్ తగ్గింది. మరోవైపు నిర్మాణ రంగం కూడా దెబ్బతినడంతో ఇసుక విక్రయాలు అంతగా సాగలేదు. దీంతో ధరలు పెరగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణాలపై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు పూర్తిస్థాయిలో రీచ్‌లు అందుబాటులోకి లేకపోవడంతో డిమాండ్ ఏర్పడింది. ఓపెన్ ర్యాంపులు ఇంకా తెరుచుకోలేదు. దీంతో ఆన్‌లైన్ బుకింగ్‌పై దళారులు పట్టుసాధించారు. ముందుస్తు సమాచారం తెలుసుకుంటున్నారు. ఏ సమయంలో బుకింగ్ అందుబాటులోకి వస్తుందో ముందుగా దళారులకు కొంతమంది సిబ్బంది సమాచారం చేర వేస్తున్నారంటూ కూటమి నేతలు గగ్గోలు పెడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి మచ్చవస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని ఇసుకను పశ్చిమకు తరలిస్తున్నారు. దళారులు దందా సాగిస్తున్నారు. బుకింగ్ విధానంలో మతలబుల వల్లే దళారులకు ప్రయోజనం చేకూరుతోంది. జిల్లాలో అధిక ధరలకు ఇసుక విక్రయాలకు అవకాశం ఏర్పడుతోంది. నిరంతరం బుకింగ్ అందుబాటులో ఉంటే ప్రతీ ఒక్కరూ కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నిర్మాణదారులు కూడా బుకింగ్ సమస్యలేకుండా దళారులను ఆశ్రయిస్తున్నారు. లేదంటే అనుకున్న సమయానికి ఇసుక అందుబాటులోకి రావడం లేదు. దీనిపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలి. ఆన్‌లైన్ బుకింగ్ విధానం సవ్యంగా సాగేలా చూడాలి.

ఇసుక దందాలో ఇదో మతలబు

- ఇసుక విక్రయాల్లో ఆన్‌లైన్ మాయాజాలం
- దందా సాగిస్తున్న దళారులు
- వెల్లువెత్తుతోన్న విమర్శలు
- అధికార యంత్రాంగం దృష్టి పెట్టాల్సిందే..



నిల్వలపై కన్ను

అధిక ధరలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. అనధికారిక విక్రయాలను అడ్డుకుంటామని అధికారులు చెబుతున్నారు. జిల్లా అధికారులు ఇసుక విక్రయాలపై సమీక్ష నిర్వహించారు. ఇసుక నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఎవరూ ఇసుకను నిల్వచేసుకోరు. ఇసుకను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దానినే దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వస్తేనే ఇసుకకు డిమాండ్ తగ్గుతుంది. అప్పుడే ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. దళారుల దందా సన్నగిల్లుతుంది. ఆన్‌లైన్ కష్టాలు ఉన్నట్టయితే మళ్ళీ దళారులు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఇసుక విరివిగా లభించేలా చేసినప్పుడే సమస్యల పరిష్కారం లభిస్తుంది. అప్పటివరకు ఎన్ని విధానాలు అమలు చేసినా దళారులను అరికట్టే అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి

ఇసుక ర్యాంపుల్లో అర్ధరాత్రి తనిఖీలు



ఇసుక ర్యాంపులో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

ఆచంట, అక్టోబరు 6 : గోదావరి తీర ప్రాంతాల్లో ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవని ఎవరైనా అక్రమంగా తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే తహసీల్దార్ ఎం.సోమేశ్వర రావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి అయోధ్యలంక, కోడేరు, కరుగోరుమిల్లి, ఇసుక ర్యాంపులను ఎస్‌ఐ కె.వెంకట రమణతో కలిసి ఆయన పరిశీలించారు. అయోధ్యలంకలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహిం చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మి, స్థానిక వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అనధికారిక ఇసుక అమ్మకాలు ఉపేక్షించం

కలెక్టర్ నాగరాణి హెచ్చరిక

భీమవరం టౌన్, అక్టోబరు 6 : జిల్లాలో అనధికారిక ఇసుక అమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి ఉచిత ఇసుకపై విలేకరు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఇసుక అందుబాటులో లేదన్నారు. జిల్లాలో ఐదు డీసిల్టేషన్ పాయింట్లలో మూడు లక్షల టన్నులు, ఆరు ఓపెన్ రీచ్‌లలో 4.20 లక్షలు టన్నుల ఇసుక సీఆర్‌జడ్ పరిధిలో ఉండడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అంక్షలు ఉన్నాయని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, అనుమతులు వస్తే జిల్లాలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. ఈనెల 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 108 ఓపెన్ రీచ్‌లు, 28 డీసిల్టేషన్ పాయింట్ లు, 48 సెమీ డీసిల్టేషన్ పాయింట్‌లు అందుబాటులోనికి వస్తాయని, ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో అవసరమైన లబ్ధిదారులు ఇసుకను పొందుటకు ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలని సూ చించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కరించడానికి జిల్లా కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను, ఆరుగురు టెక్నికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. 93914 45753, 86882 91997, 81869 39223, 95501 75144 నంబర్లకు ఫోన్ చేసి టెక్నికల్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరలు అనుగుణంగా వినియోగదారులకు సక్రమంగా అందేలా పోలీసు శాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం వాసవీ కాలేజీలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా 'టెట్'

భీమవరం ఎడ్యుకేషన్/తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6 : ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్-2024 పరీక్ష మూడోరోజు ఆదివారం డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ భీమవరం పరీక్ష కేంద్రంలో ప్రశాంతంగా జరిగిందని డీఈవో జి.నాగమణి తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లుగా జరిగిన ఈ పరీక్షలో 846 మంది అభ్యర్థులకు గాను 710 మంది హాజరయ్యారు. 136 మంది గైర్హాజరయ్యారు. హాజరు 84 శాతంగా నమోదైంది. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 227 మందికి 184 మంది, సాయంత్రం 226 మందికి 182 మంది పరీక్షలు రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని ఆమె తెలిపారు.

చిన వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



7

సొంత ఇల్లు ఎంత దూరం ?

నేడు ప్రపంచ ఆవాస దినోత్సవం

వందే భారత్‌కు రెడ్‌సిగ్నల్

- భీమవరానికి వాటర్ సమస్య
- నరసాపురానికి సమయం సాకు



నరసాపురం, అక్టోబరు 6: చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ జిల్లావరకు పొడిగింపునకు సదరన్ రైల్వే అడుగడుగునా రెడ్‌సిగ్నల్ వేస్తుంది. ఏదో ఒకసాకు చూపించి ఆరునెలలుగా ఈ రైలుకు పచ్చజెండా ఊపకుండా బ్రేక్‌లు వేస్తూ వస్తుంది. ఈ కారణంగా డెల్టాలో వందేభారత్ రైలు కూత నేటికి వినిపించలేదు. జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధులు పోరాటం వీడటం లేదు. మూడు రోజుల క్రితం విజయవాడలో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంతో జరిగిన ఎంపీల సమావేశంలో ఈ రైలు అంశం ప్రధాన టాపిక్ అయింది. ఆరునెలల క్రితం ప్రతిపాదించి నేటికి ఎందుకు పట్టాలెక్కించేదని నిలదీశారు. ఎదురవుతున్న సమస్యల్ని అధికారులు వివరించడంతో వాటిని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయానికి వచ్చారు.

ప్రస్తుతం నడుస్తోంది ఇలా..

ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ఇది చెన్నైలో ఉదయం 5.30కి బయలుదేరి విజయవాడకు 12.10కి వస్తుంది. తిరిగి విజయవాడలో 3.20కు బయలుదేరి చెన్నైకు రాత్రి 10 గంటలకు వెళుతుంది. విజయవాడ జంక్షన్‌లో దాదాపు మూడు గంటల పాటు నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆ సమయంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల ఈ రైలును మరో స్టేషన్ వరకు పొడిగించాలని గత ఏడాది రైల్వే అధికారులు ఆలోచించారు. ఆ సమయంలో జిల్లాలోని భీమవరం స్టేషన్ ప్రతిపాదన కొచ్చింది. జిల్లా నుంచి చెన్నై వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల రద్దీ, జిల్లాకు వందేభారత్ కేటాయించినట్టు అవుతుందని అధికారులు యోచించారు. సమయం సరిపోతుందని అంచనాకు వచ్చారు. విజయవాడలో 12.15కి బయలు దేరితే భీమవరం గంటలో చేరుకుంటుంది. తిరిగి రెండు గంటలకు భీమవరంలో బయలుదేరితే మూడు గంటలకల్లా విజయవాడ చేరుకుంటుంది. ఈ ప్రతిపాదనలకు రైల్వే ఆమోదం తెలిపింది. అప్పట్లో ఎన్నికల నోటిఫికేషన్ రావడం వల్ల దీనికి బ్రేక్‌పడింది

సదరన్ రైల్వే కొర్రీలు..

ఈ రైలు పొడిగింపునకు చెన్నై సదరన్ రైల్వే ఆసక్తి చూపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పొడిగిస్తే చెన్నైకు రాత్రి 10 గంటల లోపు చేరుకోదన్న వాదనలు తెరమీదకు తీసుకొచ్చింది. అంతేకాకుండా భీమవరం స్టేషన్‌లో ఈ రైలుకు నీళ్లు నింపే పైప్‌ల విధానం, నిర్వహణ సిబ్బంది లేరని కొర్రి పెట్టింది. అధికారులు కూడా ఆలోచనలో పడ్డారు. భీమవరం వరకు పొడిగిస్తే స్టేషన్‌లో వాటర్ నింపేందుకు మళ్లీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి. ఇది కాకుండా అదనపు సిబ్బందిని నియమించాల్సి వస్తుంది. ఇది అనేక వ్యయప్రయాసలతో కూడిందని నిర్ణయానికి వచ్చారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఈ రైలును నరసాపురం వరకు పొడిగించాలని, అన్ని సౌకర్యాలు ఆ స్టేషన్‌లో ఉన్నందున పొడిగిస్తే జిల్లాకు ఈ రైలు సౌకర్యం కల్పించినట్టు అవుతుందని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లారు. సదరన్ రైల్వే మళ్లీ కొర్రి వేసింది. నరసాపురం వరకు పొడిగిస్తే.. చెన్నై వచ్చేటప్పటికీ అర్ధరాత్రి దాటుతుందన్న వాదనలు వినిపించడంతో ఈ ప్రతిపాదన కూడా నిలిచినట్టయింది. జిల్లా ప్రజా ప్రతినిధులు మాత్రం పట్టువీడడం లేదు. ఎట్టకేలకు ఈ రైలు భీమవరం వస్తుందా.. లేక నరసాపురం వరకు పొడిగిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

జీతాలకు నోచుకోని లస్కర్లు



కాల్వలో చెత్త, తూడ తొలగిస్తున్న లస్కర్లు (ఫైల్)

13 నెలల జీతాలు పెండింగ్.. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ఆకివీడు రూరల్ అక్టోబరు 6 : రాత్రనక.. పగలనక.. వరద వచ్చినా... వంతులు వారి విధానమొచ్చినా... తూడు, గుర్రపుడెక్క తొలగించాల్సి వచ్చినా, వంతెనల వద్ద అడ్డుపడినా, గట్లు బలహీనపడినా...పటిష్ట పర్చాల్సి వచ్చినా...లస్కర్లు బాధ్యత తీసుకుంటారు. ఆపని పూర్తయ్యే వరకు శ్రమిస్తారు. చాలీచాలనీ జీతాలతో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే లస్కర్లు నేడు జీతాల కోసం అలమటిస్తున్నారు. డెల్టా ప్రాంతాంలో కాలువల నీరు శివారు ప్రాంతాల వరకు చేరాలన్నా లస్కర్లు పాత్ర ఎంతో ప్రముఖమైనది. ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల్లో 431 కి.మీ. మేర ప్రధాన కాలువలు, 2024 కి.మీ మేర చిన్న కాలువలు ద్వారా సుమారు 9లక్షలు ఎకరాలకు సాగునీరు అందుతున్నది. దీని ప్రకారం జిల్లాలో 2వేలు మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 610మంది కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. రెగ్యులర్ లస్కర్లకు రూ.50వేల వరకు జీతాలుండగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే వారికి రూ.10.500 మాత్రమే ఇస్తున్నారు. ఈ జీతాలు కూడా సక్రమంగా అందడం లేదు. 13నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు లేక అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 2022-23లో ఫిబ్రవరి, మార్చి నెలలు, 2023-24లో 8నెలలు, 2024-25లో జూన్, జూలై, ఆగస్టు నెలలకు జీతాలు రావాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు టెండర్లు వేసి పనులు చెయ్యకపోయినా అధికారుల ఆదేశాల మేరకు వీరే ఆ పనులు చేశారు. వరదలు సమయంలో గట్లు పటిష్టపరచడం, గట్లు వెంబడి పర్యవేక్షణ చెయ్యడం తూడు, గుర్రపుడెక్క తొలగించడం చేశారు. కుటుంబాలు గడవడం లేదని, పిల్లలను చదివించుకోవడానికి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమొచ్చాక తమ జీవితాలలో వెలుగు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. తమను కూటమి ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందని గంపెడు ఆశతో వేచి చూస్తున్నారు.

జీతాలు చెల్లించాలి



వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు లేక ఇబ్బందులు పడ్డాం. కష్టపడినా తగిన గుర్తింపు లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే విధులలో చేరాం. 13 నెలలు జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. వరదల సమయంలో రాత్రనక, పగలనక, విషకీటకాలు మధ్య సేవలందిస్తున్నాం.

– ప్రసాద్, కాంట్రాక్ట్ లస్కర్, ఉండి

కూటమి ప్రభుత్వం మీదే ఆశ



కూటమి ప్రభుత్వం వచ్చాక తమ జీవితాలలో వెలుగువస్తుందని ఆశపెట్టుకున్నాం. వైసీపీ హయాంలో కాలువలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాంట్రాక్టర్లు పనులు సక్రమంగా చెయ్యకపోవడంతో భారమంతా లస్కర్లుమీదే పడింది. జీతాలు పెంచాలి. ఖాళీ పోస్టులను భర్తీ చెయ్యాలి, ప్రస్తుతం పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చెయ్యాలి

– రాజు , లస్కర్ల యూనియన్ లీడర్

కూరగాయలు అధరహో

- టమోటా కేజీ రూ.40 నుంచి రూ.80కు పెంపు



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

పెంటపాడు, అక్టోబరు 6 :మార్కెట్‌లో ఆదివారం కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయి. కూరగాయల ధరల మంటను చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. రూ.400 చెల్లించినా కవర్ మొత్తం నిండని పరిస్థితి నెలకొంది. ప్రతీ కూరగాయ ధర ఆఫ్ సెంచరీ దాటేయడం లేదా చేరువ కావడం జరిగింది. అన్నింటికంటే టమోటా ధర మోత మోగించింది. గతవారం టామోటాలు కిలో రూ. 40 ఉంటే ఈ వారం అమాంతంగా రూ.80లకు చేరువైంది. గ్రామాల్లో కొన్నిచోట్ల రూ. 90కు విక్రయాలు సాగించారు. వాతావరణంలో మార్పుల కారణంగా దిగుబడి తగ్గిపోవంతో ధరలకు రెక్కలు వచ్చాయని వ్యాపార వర్గాలు తెలిపాయి. పాత ఉల్లి పాయలు కిలో రూ.55, కొత్త ఉల్లి ధర రూ.35 పలికింది. కూరగాయలు గత వారం కంటే పెరిగాయి. తెల్లవంకాయలు రూ.60, నల్ల వంకాయలు రూ.60, బెండకాయలు రూ.40, దొండకా యలు 60, బీరకాయలు 60, పచ్చిమిర్చి 40, దోసకాయలు .60, క్యాబేజీ 40, ములక్కాడ ఒకటి 10, చిక్కుడు కాయలు 80, అరటికాయలు మూడు 20, బీన్స్ 100, క్యాప్సికం 90, అల్లం 80, కొత్తిమీర కట్ట రూ.20 ఉన్నాయి.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు


మహిళలకు కుట్టుమిషన్లు అందజేసిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, అక్టోబరు 6 : భవిష్యత్తులో కాపులకు రాజ్యాధికారం వస్తుందని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించ వచ్చనని, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కోపా కల్యా ణ మండపంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాపులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. పేదవారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేయడం గొప్ప విశేషమన్నారు. అనంతరం విశ్వబలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్య సహకారంతో 74 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, కోపా అధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్‌రావు, కార్యదర్శి అరేటి సత్యనారాయణ, జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, యిర్రింకి సూర్యారావు, పీవీ రావు, కృష్ణారావు, కారటం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌హాల్ కార్యవర్గానికి మంత్రి అభినందనలు

పాలకొల్లు రూరల్, అక్టోబరు 6 : పట్టణంలోని టౌన్ హాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్టును మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. టౌన్ హాల్ అధ్యక్షుడు వి.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఆదినారాయణ, కోశాధికారి వై.శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

శాశ్వత వ్యాధిగ్రస్తులకు చేయూత నివ్వాలి

భీమవరం టౌన్, అక్టోబరు 6 : శాశ్వత వ్యాధిగ్రస్తులకు చేయూతనివ్వాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. చెవిటి వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి విలువైన చెవిటి మిషన్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి శ్రీవేంకటేశ్వర బధిర పాఠశాలలో పని చేస్తున్న పద్మనాభ రాజు ఆర్థిక సహకారంతో చెవిటి మిషన్ అందించామన్నారు. ఎ.రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర నాయకులు కె.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


జువ్వలపాలెం హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కాళ్ళ, అక్టోబరు 6 : సుమారు 17 ఏళ్ల క్రితం 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలయికకు జువ్వలపాలెం హైస్కూల్ వేదికైంది. ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకుని ఉత్సాహంగా గడిపారు. ఇందుకు కృషి చేసిన స్నేహితులను తోటి విద్యార్థులు అభినందించారు. విశ్రాంత హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస రాజు, వరలక్ష్మీ, పుష్పలత, సీతాదేవి, జ్యోతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామ సతీమణి జన్మదిన వేడుకలు


రమాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న సరళాకుమారి, తెలుగు మహిళలు

ఆకివీడు, అక్టోబరు 6 : ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు సతీమణి రమాదేవి జన్మదినోత్సవ వేడుకలు ఆదివారం తెలుగు మహిళలు ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవ తి, బొర్రా సుజాత, ఇల్లాపు కృష్ణవేణి ఉన్నారు.

ఇసుక దోపిడీ అరికట్టాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

నరసాపురం టౌన్, అక్టోబరు 6 : ఉచిత ఇసుక విధానం పటిష్ఠంగా అమలు చేసి, దళారుల దోపిడీని అరికట్టాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఇసుక కొరతను నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మి థియేటర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగారు. పాతబజార్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేసి, అక్కడ కొద్ది సేపు ధర్నా చేశారు. వీరి ఆందోళనకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేసిందన్నారు. ఇసుక లేక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాన్నారు. ఈ కారణంగా పనులు లేక కార్మికులు పస్తులతో ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఇసుకను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కె.పెద్దిరాజు, ఎం.త్రిమూర్తులు, పి.నారాయణరావు, రామకృష్ణ, ప్రకాష్, మల్లేష్, బద్రీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య విస్తరణాధికారి హరిబాబుకు సత్కారం


హరిబాబును సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 6 : స్వచ్ఛతా హీ సేవాలో చేసిన సేవలకు కలెక్టర్ నాగరాణి, మంత్రి నిమ్మల చేతుల మీదుగా అవార్డు అందుకున్న లంకలకోడేరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి జి.హరిబాబును ఆదివారం సిబ్బంది, వైద్యులు సత్కరించి అభినందించారు. డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్, నవ్యజీవన్, పీవీ స్వామి, రమేష్ బాబు, ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు, సిబ్బంది కమల, సుజిత, గౌతమి, రాజేశ్వరి లికిత, ట్రైనీ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఊర్లు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

గణపవరం, అక్టోబరు 6: దసరా, దీపావళి పండుగ సెలవుల్లో పొరుగూరు వెళ్లే గృహవాసులు బంగారం, నగలు, నగదు భద్రపరుచుకోవాలని గణపవరం ఎస్ఐ మణికుమార్ హెచ్చరించారు. దొంగల బారిన పడ కుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఏలూరు కంట్రోల్ రూమ్‌కు లింక్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విలువైన వస్తువులు బ్యాంకు లాకరులో భద్రపరుచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు కనపడితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు, 112కు కానీ వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. పోలీసుల గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, అక్టోబరు 6 : పట్టణంలోని నర్సయ్య అగ్రహారం పార్క్ వీధిలో పేకాట శిబిరంపై వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు ఆదివారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.పది వేల 430లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.


అన్నపూర్ణాదేవిగా మావుళ్ళమ్మ ఉత్సవమూర్తి


తణుకులో గాయత్రీదేవి గా వాసవీ మాత


ఆకివీడులో లలితా త్రిపుర సుందరిదేవిగా పెద్దింట్లమ్మ


లలితాత్రిపుర సుందరి దేవిగా ఆచంట పార్వతమ్మవారు


పెనుగొండలో అన్నపూర్ణదేవిగా మహిషాసురమర్దని అమ్మవారు


పెంటపాడులో శాఖాంబరిగా విశ్వదుర్గేశ్వరి అమ్మవారు


లలితాదేవిగా అత్తిలి బస్టాండ్ సమీపాన గల దుర్గమ్మవారు

జై దుర్గా భవానీ

వివిధ రూపాలలో దర్శనమిచ్చిన అమ్మవార్లు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్/ఆకివీడు/కాళ్ళ/ఆచంట/పెనుగొండ/మొగల్తూరు/పెంటపాడు/గణపవరం/తాడేపల్లిగూడెం రూరల్/అత్తిలి/ఇరగవరం, అక్టోబరు 6 : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మావుళ్ళమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు ప్రధానార్చకుడు ఉత్సవ మూర్తికి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి లక్ష కుంకు మార్చన నిర్వహించారు. శ్రీరాంపురంలోని శ్రీజగన్నాత కనక దుర్గమ్మను, మెంటే వారి తోటలోని శ్రీవిజయ కనక దుర్గా శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మను, నాచు వారి సెంటర్‌లోని శ్రీకనక దుర్గమ్మను కనకదుర్గగా, గునుపూడి ఆది లక్ష్మీమ్మను, గునుపూడిలోని పార్వతీ అమ్మను, భీమేశ్వర స్వామి ఆలయంలో మహిషాసురమర్ధిని అమ్మ అన్నపూర్ణా దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పాలకొల్లు శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా, చిన్నగోపురం వీధిలోని అమ్మవారిని శ్రీఅన్నపూర్ణా దేవిగా అలంకరించారు. ఆకివీడులో పెద్దింట్లమ్మ లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. కాళ్ళ మండంలో కాళ్ళకూరులో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ అమ్మవారు సంతానలక్ష్మీగా దర్శనమిచ్చారు. ఆచంటలోని పార్వతి అమ్మవారు పెదమల్లం మాచేనమ్మ అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. పెనుగొండ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో వాసవీ కన్యకాపరమేశ్వరిగా, మహిషాసుర మర్ధని, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. తణుకు మండపాక యల్లారమ్మ, తణుకు వాసవీ మాత ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద గల దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. భైరాగిమఠంలో అమ్మ వారికి ఆలయ ఫిట్‌పర్సన్ బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పట్టణంలోని విశ్వదుర్గేశ్వరి ఆలయంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ లలితా దేవిగా, వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని కూష్మాండదేవిగా దర్శనమిచ్చారు. అత్తిలి బస్టాండ్ సమీపాన గల దుర్గమ్మను, కాలువ గట్టున ఉన్న ఐశ్వర్యదుర్గను లలితా దేవిగా అలంకరించారు. తణుకు మండలం దువ్వలోని దానేశ్వరమ్మ ఆలయంలో కుంకుమార్చన చేశారు.


పాలకొల్లు అర్బన్, అక్టోబరు 6 : స్థానిక యడ్ల బజారులో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో ఎన్.సతీష్ కుమార్, జి.వెంకటేశ్వరరావు, పి.బాబు, జి.రాంబాబు, ఉన్నారు.


తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 6: పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి దర్శించుకుని పూజలు చేశారు. పట్నాల రాంపండు, ఎరుబండి సతీష్, ముత్యాల శ్రీనివాస్, డి.తిరుమలరావు పాల్గొన్నారు.


ఉండి, అక్టోబరు 6 : దేవీన వరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని కనకదుర్గమ్మకు మహిళలు ఆదివారం ఉదయం నుంచి సామూహిక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేశారు.


నరసాపురం టౌన్, అక్టోబరు 6 : పట్టణంలోని స్టీమర్‌రోడ్‌లో అమ్మవారు కూష్మాండదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అమ్మవార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఎం.కృష్ణ, జి. శ్రీను పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.2.68 లక్షల సాయం


చెక్కు అందజేస్తున్న బాలకృష్ణంరాజు

భీమవరం టౌన్, అక్టోబరు 6 : కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవడం దాతలు ముందుకు రావడం అభినంద నీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ వరద బాధితుల సహాయార్థం రూ. రెండు లక్షల 68 వేల సాయాన్ని ఎమ్మెల్యే అంజి బాబుకు అందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎస్.శంకర్ కుమార్ వర్మ, జి.బాలకృష్ణంరాజు, డాక్టర్ యూవీ రమణరాజు, ఎం.రంగారావు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన


విలేకరులతో మాట్లాడుతున్న తాతాజీ

పెనుమంట్ర, అక్టోబరు 6 : బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన వచ్చిందని జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. పాలమూరులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు ఎన్డీఏ పాలనను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ప్రతి ఆరు ఏళ్లకు ఒకసారి జరిగే సభ్యత్వ నమోదులో కేంద్ర పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వంలో నరేంద్ర మోదీ తొలి సభ్యత్వం నమోదు చేశారని పేర్కొన్నారు భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాస్ వర్మ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని తాతాజీ అన్నారు ఆచంట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కేహెచ్‌ఈవీ ప్రసాద్ రెడ్డి, మారుతీ కృష్ణ, వై.కాశీవిశ్వనాథ్, వాడపల్లి పృథ్వీ రాజ్, తుపాకుల గోవిందా చారి తదితరులు పాల్గొన్నారు.

● ఉండి : ప్రధాని నరేంద్ర మోదీ దేశపురోభివృద్ధికి మంచి బాటలు వేస్తున్నారని అందుకే జిల్లాలో ఎక్కువ సభ్యత్వ నమోదు జరుగుతుందని జిల్లా బీజేపీ ప్రముఖ్ వెంకటరెడ్డి అన్నారు. పాములపర్రులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు యర్ర విక్రమ్ కోకన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు, కొమ్మన సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాలతో గ్రామోత్సవం


బోనాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ళ, అక్టోబరు 6 : శరన్నవ రాత్రులను పురస్కరించుకొని కోమటిగుంట లో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల సంబరాలు ఆదివారం వైభవం గా నిర్వహించారు. సుమారు 150 మంది మహిళలు ప్రత్యేక అలంకరణలో, భవాని మాలదారులు నెత్తిన బోనాలు పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించా రు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమకు మూలస్తంభం పుల్లయ్య


పుల్లయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లులర్పిస్తున్న రంగసాయి,తదితరులు

భీమవరం టౌన్, అక్టోబరు 6 : తెలుగు సినీ పరిశ్రమ మూలస్తంభాలలో చిత్తజల్లు పుల్లయ్య ఒకరని కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జావ్వాది దాశరథి, చిరు పవన్ తేజం సేవా సంస్థ అధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు, ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్కే చాన్ భాషా అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కన్వేన్షన్ హాల్లో పట్టణ కళా సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత సి.పుల్లయ్య వర్ధంతి నిర్వహించారు. వారు మాట్లాడుతూ టాకీ సినిమా ప్రారంభ రోజుల్లో, తెలుగు చిత్ర పరిశ్రమలో గ్రాండ్ ఓల్డ్ సి.పుల్లయ్య, పౌరాణిక ఇతివృత్తాల సిరియల్ సినిమాలు చేయాలని నిర్ణయించుకుని సతి సావిత్రిని ప్రారంభించారని, ఆది ప్రజాదరణ పొందిందన్నారు. మూడేళ్లలో లవకుశ, అనసూయ, ధృవ విజయం, సినిమాలు చేశారని, దాదాపు ఈ సినిమాలన్నీ ఆ రోజుల్లో విజయవంతంగా నడిచాయని అన్నారు. చెరుకువాడ రంగసాయి, భూపతిరాజు సత్యనారాయణ రాజు (బుజ్జి) మాట్లాడుతూ ఇండస్ట్రీకి అంజలీదేవి, భానుమతి, పుష్పవల్లి వంటి నటీమణులను పరిచయం చేసిన ఘనత ఆయనదేనని, అయినప్పటికీ, తన తూర్పు గోదావరి యాస విలక్షణమైన ఆంధ్రుల గెటప్‌కు ప్రసిద్ధి చెందారన్నారు.

152 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

ఆకివీడు రూరల్ అక్టోబరు 6 : దుంపగడపలో ఆకివీడులోని లయన్స్ క్లబ్, ఆదర్శ క్లబ్, అభయా క్లబ్, ఆక్వాక్లబ్‌లు, భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు ప్రారంభించారు. 152 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. వీరిలో 24 మందికి కళ్లజోళ్లు, 16 మందికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ పి.కృష్ణచైతన్య, జ్యోతిరెడ్డి, మురళీరాజు, రామరాజు, గోపాలరాజు, నరసింహం, సుబ్బరాజు, గుర్రం శ్రీను, వెంకన్నబాబు తదితరులు సేవలందించారు.

కుక్కలతో జనం బెంబేలు



ఇరగవరం, అక్టోబరు 6 : ఇరగవరం ప్రధాన వీధుల్లో గుంపులుగా కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వీటి బెడద మరింత అధికంగా ఉంటోంది. వృద్ధులు, చిన్నారులను వెంటబడి కరుస్తున్నాయి. రాత్రి సమయాల్లో అత్యవసర పనులపై బయటకు రావాలంటే చేతిలో కర్ర ఉండాల్సిందే. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్ళే సమయంలో దాడి చేస్తాయేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కుక్కలకు సంతాన నిరోధక టీకాలు వేసి అదుపు చేయాలని కోరుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ ఆకిశెట్టివారి రామాలయం వద్ద అమ్మవారిని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు.

డిసెంబరులో జూబ్లీ ఉత్సవాలు

భీమవరం టౌన్, అక్టోబరు 6 : స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో డిసెంబర్ 14,15 తేదీలలో కోరల్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, కన్వీనర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ వేడుకలు వైహెచ్ఏఐ నేషనల్ చైర్మన్, మనోజ్ జోరి ప్రారంభిస్తారని, కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. వేడుకల సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించి, ప్రశంసాపత్రాలు, మెరిట్ మెడల్స్ అందజేస్తామని శ్రీనివాస్ తెలిపారు. ప్రొఫెసర్ ఎ.సత్యనారాయణ, డాక్టర్ సోమరాజు, డాక్టర్ కె.సత్యనారాయణ, బి.పాండు రంగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ధ్యానం చేయాలి

అత్తిలి, అక్టోబరు 6: ఏకాగ్రతతో ధ్యానం చేస్తే ఆరోగ్యవంతులు కాగలరని ద్రాక్షారామానికి చెందిన పిరమిడ్ మాస్టర్ బి. సుబ్ర హ్మణ్యగుప్తా అన్నారు. అత్తిలిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో దాసం ప్రసాద్ గృహంలో బి.సుబ్రహ్మణ్యగుప్తా, అన్నపూర్ణ ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. శాఖాహారంతో ధ్యానం కుదురు తుందని, సాత్వికాహారం భుజించాలని అన్నారు. మనో నేత్రం తెరవాలం టే ధ్యానం ఒక్కటే మార్గమన్నారు. ధ్యాన మండలి ప్రతినిధులు దాసం ప్రసాద్, కడలి మాణిక్యాలరావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు టీగలు కుట్టి కొబ్బరి దింపు కార్మికుడి మృతి


ఆచంట, అక్టోబరు 6 : గుర్రపు టీగలు కుట్టి కొబ్బరి దింపు కార్మికుడు మృతి చెందిన ఘటన నెలకొంది. ఆచంట ఎస్ఐ కేవీ రమణ తెలిపిన వివరాలు ప్రకారం విజయనగరం జిల్లా బోగాపురం మండలం చావరివిల్లి గ్రామానికి చెందిన కండిబోయిన యర్రయ్య, బాడితమాని రెల్లబాబు సుమారు 20 రోజులు క్రితం ఆచంట మండలం అయోధ్యలంక శివారు మర్రిమూలకు కొబ్బరిదింపు నిమిత్తం వచ్చారు. గ్రామానికి చెందిన కొప్పాడి సోమరాజు కొబ్బరి తోటలో దింపు తీస్తుండగా ఈ నెల 5న రెల్లబాబు (49) దింపుతీసే సమయంలో గుర్రపుటీగలు ముఖం, శరీరం అంతటా కుట్టడంతో వెంటనే తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే రెల్లబాబు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కండిబోయిన ఎర్రియ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మబ్బుల మాటున సూరీడు



ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవిని తలపించేలా ఎండలు కాస్తూ ఉక్కపోత వాతావరణంతో ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో ఆదివారం సాయంత్రం వాతావరణ చల్లబడటంతో ప్రజలు సేద తీరారు. - తణుకు

ఇంకెన్నాళ్లీ బాధలు..


సిద్ధాంతంలో గోతుల మయంగా రహదారి


రామన్నపాలెం వద్ద ప్రజల పాట్లు

పెనుగొండ, అక్టోబరు 6 : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు గోతులు, రాళ్లు లేచి అధ్వానంగా మారాయి. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దొంగరావిపాలెం-పెనుగొండ ఆర్అండ్‌బీ రహదారి సుమారు 10 కిలోమీటర్లు ఉండగా సిద్ధాంతం, రామన్నపాలెం, వడలి, మల్లప్పదిబ్బ గ్రామాల పరిధిలో భారీగా గోతుల ఏర్పడ్డాయి. గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి అవస్థలు తప్పడం లేదు. ఈ గోతుల్లో పడి పలువురు వాహనచోదకులు గాయాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి తక్షణం వాటిని పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

దసరా సరదాల్లో జర జాగ్రత్త..

సెలవుల్లో పిల్లల నడవడికపై ఓ కన్నేయండి



పోలవరం, అక్టోబరు 6 : పిల్లలకు దసరా సెలవలు ఇచ్చేశారు. అమ్మమ్మ తాతయ్యల ఇళ్లకు, బంధువుల ఇంటికి చెక్కేస్తారు. సెలవుల్లో ఎంజాయ్‌మెంట్ కోసం స్నేహితులు, బంధువుల పిల్లలతో కలిసి ప్లానింగ్ చేస్తుంటారు. సమీపంలో ఉండే నదులు, కాలువల్లో స్నానాలకోసం వెళుతుంటారు. అక్కడి పరిస్థితులు తెలియకపోవడం వల్ల ప్రమాదాల భారిన పడి ప్రాణాలు కోల్పోతుంటారు. స్నానాల కోసం పెద్దలకు చెప్పకుండా స్నేహితులతో కలిసి వెళ్లిపోతుంటారు. ఇలాంటి సమయంలో పెద్దలు ఒకింత అప్రమత్తతో ఉండాలి. వారిని ఒక కంట కనిపెట్టుకుని ఉండాలి. ఉధృతంగా ప్రవహిస్తున్న సెలయేళ్లు, కాలువలు, నదులు, రైల్వే ట్రాకులపై సెల్ ఫోన్లలో సెల్ఫీలు, రీల్స్ తీసుకునే పిచ్చిలో ప్రమాదాల బారిన పడుతున్నారు. బైకులతో రేసులంటూ కొత్త పోకడలకు పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అలా అని ఫోన్లు ఇచ్చి ఇంట్లో కుర్చోబెట్టడం కూడా ప్రమాదమే. ఫోన్లలో ఆన్‌లైన్ బెట్టింగులు, అశ్లీల వెబ్‌సైట్లు చూస్తున్నారేమో అని ఒక కంట కనిపెడుతూ ఉండాలి..సెలవులు సాఫీగా సరదాగా సాగిపోవాలంటే పెద్దలు అప్రమత్తంగా ఉండాలి..

చిన వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



ద్వారకాతిరుమల,అక్టోబరు 6: చిన్న తిరుమలేశుని ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలకు క్షేత్రంలో ఏర్పాట్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 13 నుంచి 20 వరకూ వైఖానస ఆగమయుక్తంగా బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రధానరాజగోపురం, అలయ ప్రాంగణం, పాతకల్యాణ మండప ప్రాంతంలో విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు.13 నుంచి 20 వరకూ నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఈవో మూర్తి తెలిపారు. 13న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారునిగా, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. 14న ధ్వజారోహణ, 16న ఎదుర్కోలు ఉత్సవం, 17న రాత్రి 8 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 18న రాత్రి 7 గంటలకు రథోత్సవం, 19న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజఅవరోహణ. 20న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశకోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈవో తెలిపారు

అంతరిక్ష అద్భుతాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 6 : భారతదేశ అంతరిక్ష పరిశోధనలు కేవలం రాకెట్లు, ఉపగ్రహాల గురించి మాత్రమే కాదని, వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడం ద్వారా భవిష్యత్ తరాలు స్థిరమైన, సురక్షితమైన జీవనం పొందేలా చేయడమని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆది వారం భీమవరం బీవీ రాజు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రపంచ అంత రిక్ష వారోత్సవాలు- 2024 ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇస్రో సాధించిన అద్భుతమైన అంతరిక్ష పరిశోధన ఫలితాలు గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. భూమి పరిశీలనలో ఇన్‌శాట్, జీశాట్, కార్టోశాట్ వంటి ఉపగ్రహాలు విలువైన డేటాను అందిస్తున్నాయన్నారు. శ్రీహరికోట షార్ సెంటర్ వీఏఎల్ఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం మాట్లాడుతూ పరిశోధనలు కేవలం అన్వేషణ కోసం మాత్రమే కాకుండా భూమిపై జీవితాన్ని మెరుగుపరచడం కోసం ఉపయోగపడుతుందన్నారు. షార్ ఎస్‌డీఎస్‌సీ జనరల్ మేనేజర్ ఏడుకొండలు, విష్ణు కాలేజీ స్కూల్ ప్రిన్సిపాల్ బిందు, ఇస్రో శాస్త్రవేత్తలు, పాల్గొన్నారు.



అగ్నిమాపక శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు, అక్టోబరు 6: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నిడదవోలు అగ్నిమాపకశాఖ ఉద్యోగి తమ్మినేని ఆనందరావు అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గం ఉపాధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శిగా రమాకాంత్, సహాయ కార్యదర్శిగా నందగోపాల్, కోశాధికారిగా రామాంజనేయులు, సలహాదారుగా శ్రీనివాస్, వెల్ఫేర్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వరావు, వెల్ఫేర్ సెక్రటరీగా రుద్ర నాగయ్యలు ఎన్నికయ్యారు. మస్తాన్, రాజేష్‌లు ఎన్నికల అధికార్లుగా వ్యవహరించగా రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర, స్టేట్ ట్రజరర్ సత్యనారాయణ, స్టేట్ స్పోర్ట్స్ సెక్రటరీ సప్తగిరి గణేష్ పాల్గొన్నారు.

సొంత ఇల్లు ఎంత దూరం ?



పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు అనేది జీవితంలో ఓ కల.. దీన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు..ఎన్ని కష్టాలకైనా వెనుకాడరు. తమ జీవితం పూర్తయ్యేలోపు ఒక ఇల్లు కట్టుకుని అందులో ఒక్క రోజైనా ఉంటే చాలనుకునేవారు ఉంటారు.. ఎవరి స్థోమతను బట్టి వారు తమ సొంతింటి కలను నెరువేర్చుకుంటారు.. జీవిత కాలం కష్టపడి సొంత ఇల్లు కట్టుకుని కుటుంబంతో హాయిగా బతుకుతున్న వారు కొందరైతే, ఇల్లు కట్టుకోవాలని ప్రయత్నిస్తున్నవారు మరికొందరు. ఇప్పుడు ప్రభుత్వాలు కూడా పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నాయి. నేడు ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా కథనం. - చాట్రాయి

30 ఏళ్ళ క్రితం వరకు పక్కా ఇల్లు నిర్మించుకోవడం పెద్ద రైతులకు, ధనికులకు మాత్రమే సాధ్యం. జనాభాలో 90 శాతం ఉన్న పేద మధ్య తరగతి ప్రజలు పూరిళ్లలోనే నివాసం ఉండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. తమ స్తోమత మేరకు పక్కా ఇల్లు నిర్మించుకోవాలని నిరుపేదలు కూడా భావిస్తున్నారు. అన్ని హంగులతో సొంత ఇంటి కలను నెరువేర్చు కుంటు న్నారు. ఇందుకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ఆసరాగా నిలుస్తున్నాయి. గతంలో రైతులకు కూడా భూములు కొనాలనే ఆలోచన తప్ప పక్కా ఇళ్ల నిర్మాణంపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. 1984లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా రూ.6 వేలు యూనిట్ విలువతో పక్కా గృహనిర్మాణ పథకం ప్రారంభించారు. తరువాత అన్ని ప్రభుత్వాలు ఇళ్ల నిర్మాణ పథకాన్ని కొనసాగించాయి. తరువాత యూనిట్ విలువ క్రమక్రమంగా ప్రభుత్వాలు పెంచుతూ వచ్చాయి. రూ.6000 నుంచి 7500, 12,500, 17,500, 25,000, 28,500, 34,500, 54,550, 74,500, లక్ష, ఇప్పుడు 1.80 లక్షలు అమలులో ఉంది. ఇళ్ళు నిర్మించుకోటానికి ప్రభుత్వాలు ఇచ్చే సాయం అరకొర అయినప్పటికీ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం కష్టపడి కూడబెట్టిన కొంత సొమ్ముతో పాటు డ్వాక్రా రుణాలు, ఇతర మార్గాలలో అప్పులు తీసుకొని ఇళ్లు పూర్తి చేసుకుంటున్నారు. 1984 నుంచి చాట్రాయి మండలంలో సుమారు 10 వేల మంది పేద మధ్య తరగతి ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకున్నారు. ఇంకా సుమారు 3 వేల మంది ప్రభుత్వం పక్కా ఇళ్ల మంజూరు చేస్తే ఇళ్ళు నిర్మించుకోటానికి ఎదురు చూస్తున్నారు.

సొంతింటి కల నెరవేర్చుకున్నాం



చాట్రాయి శివారు గొల్లగూడెంలోని లేఅవుట్ కాలనీలో ప్రభుత్వం సెంటు న్నర స్థలం ఇచ్చింది. అందులో పీఎంఎవై పథకం 2022-23 కింద (యూనిట్ రూ.1.80 లక్షలు) మంజూరు చేశారు. నా భర్త షాపులో గుమాస్తాగా పనిచేస్తారు. నేను టైలరింగ్ చేస్తాను. ఇద్దరం కష్టపడి కూడబెట్టిన సొమ్ము, ప్రభుత్వ సాయం, కొంత అప్పు చేసి సొంతిల్లు నిర్మించుకున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించుకుంటున్నాం.

- కొప్పుల రజనీ, చాట్రాయి శివారు గొల్లగూడెం

జీవితాశయం నెరవేరింది



సొంత ఇల్లు కట్టుకోవాలనే మా కుటుంబ కల నెరవేరింది. నా భర్త, నేను కూలి పనులు చేస్తూ బతుకుతున్నాం. జనార్ధనవరం లేఅవుట్ కాలనీలో ప్రభుత్వం ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చింది. అందులో పీఎంఎవై పథకం కింద రూ.1.80 లక్షలు మంజూరైంది. ప్రభుత్వ సాయం, డ్వాక్రా రుణం, పొదుపు చేసుకున్న సొమ్ముతో ఇల్లు పూర్తి చేశాం. సొంత ఇంటిలో ఉంటున్నందుకు ఆనందంగా ఉంది. మా ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాం

-ఈడా రాజకుమారి, జనార్ధనవరం, చాట్రాయి మండలం.





బాస్కెట్‌బాల్ జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం .. రగ్బీలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

బాస్కెట్ బాల్ విజేత పశ్చిమ

పెనుమంట్ర, అక్టోబరు 6 : యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రస్థాయిలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన బాస్కెట బాల్ పోటీలలో పశ్చిమగోదావరి జట్టు విజేతగా నిలిచింది. మార్టేరు ఎస్‌వీజీ పాఠశాల పీడీ కృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన పోటీలలో పల్నాడు జట్టుపై పశ్చిమ జట్టు 17-09 తేడాతో విజయం సాధించినట్లు పీడీ పడాల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పశ్చిమ జట్టుకు మాజీ శాసనమండలి సభ్యులు లక్ష్మణరావు మెడల్స్ బహూకరించారు. ఫిజికల్ డైరెక్టర్లు సత్యనారాయణ, వినాయక రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దిలీప్, నాగరాజులను అభినందించారు

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు జట్టు ఎంపిక

పెదవేగి, అక్టోబరు 6: ఏలూరు జిల్లా పెదవేగి ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జాతీయ జట్టును ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 19 ఏళ్ళ విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో కర్నూలు జట్టు ప్రథమస్థానం సాధించగా, శ్రీకాకుళం ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా తృతీయస్థానం, కడప నాలుగో స్థానంలో నిలిచాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో, ఎస్‌జీఎఫ్ పరిశీలకుడు కె.నాగలింగేశ్వరరావు పర్యవేక్షణలో జట్టు ఎంపిక జరిగిందని తెలిపారు. పీడీ శేషు, పీఈటీలు గురుమూర్తి, కె.నాగేశ్వరరావు, పుల్లయ్యతో పాటు ఆయా జిల్లాల వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, అక్టోబరు 6:ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల ఫుట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపికపోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలు మూలల నుంచి పాల్గొన్న వారిలో 22 మందిని ఎంపిక చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జెల్లా వీరభద్రరావు, సుష్మిత అనే క్రీడాకారిణికి క్రీడా దుస్తులు కొనుగోలుకు రూ.5వేలు విరాళం అందచేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, సెక్రటరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 6: అల్లూరి సీతారామరాజు స్టేడియంలో టి.మోహన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రామచంద్రాపురం జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. మొదటి బహుమతిరూ.12వేలు, ద్వితీయ రూ.9 వేలు, తృతీయ స్థానం రూ.7వేలు అందజేశారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు చక్రవర్తి, మురళీకృష్ణ,డీఎస్‌డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయన కల నెరవేరేనా ?



పాడుబడిపోయిన ఇల్లు..ఇంటి లోపల గోడ కూలిన దృశ్యం

పెంటపాడు , అక్టోబరు 6 : ఆయనది ఇప్పుడు ఏడు పదుల వయసు.. మంచి ఇల్లు కట్టుకోవాలని ఆయన కలలు కంటూనే ఉన్నాడు. ఇప్పుడు ఆయన ఉంటున్న ఇల్లు కూలి పోయే స్థితిలో ఉంది..ఆ పాడుపడిన ఇంట్లోనే ఆయన బిక్కు బిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్నాడు. పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామానికి చెందిన వల్లేపల్లి గోపాలకృష్ణ తెలుగుదేశం పార్టీకి అభిమాని. పార్టీ స్థాపించిన నాటినుంచి అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఇప్పటకీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. అతని చిరకాల వాంచ మంచి ఇల్లు నిర్మించుకోవడమే..

పడిపోతున్న ఇంట్లోనే నివాసం

ప్రస్తుతం గోపాలకృష్ణ ఉంటున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇల్లు ఒక పక్క నుంచి పడిపోతున్నది. ఎవరూ కూడా అలాంటి ఇంట్లో ఉండేందుకు సాహసించరు. ఆర్థికంగా తన పరిస్థితి బాగోలేనప్పటికి ఇప్పటికి కూడా రామారావు జయంతి, వర్థంతి సమయాల్లో ఇంటి ముందు బ్యానర్ పెడుతూనే ఉంటారు. 1982లో ఎన్టీ రామారావు పార్టీ పెట్టే ఆలోచన దిశగా విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి ఈయన కూడా వెళ్ళారు. తొలిసారి తెలుగుదేశం పార్టీ విజయం సాధించినప్పుడు జట్లపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. అప్పటి నుంచి 40 సంవత్సరాలుగా ఇప్పటికీ ఆయనే గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సంపాదించుకోవడానికే రాజకీయాల్లోకి వస్తున్నారు. దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న ఆయన ఆర్థికంగా చితికిపోయారు. పార్టీ నుంచి ఎప్పుడూ ఏదీ ఆశించలేదు.

కొన్నేళ్లుగా ఆ..పాడుపడిన ఇంట్లోనే : గోపాలకృష్ణ



నాకు తెలుగుదేశం పార్టీ అంటే చాలా ఇష్టం. ఇప్పటికి పార్టీ కార్య క్రమాల్లో తప్పనిసరిగా పాల్గొంటాను. ప్రస్తుతం పాడుపడిన ఇంట్లో నివాసం ఉంటున్నాను.నాకు వేరే మార్గం లేక ఉంటున్నా. ఒకపక్క నుంచి ఇంటి గోడలు మొత్తం పడిపోతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. నా కల ఎప్పటికి సాకారం అవుతుందో తెలియట్లేదు..

కొడమంచిలి జగనన్న లేఅవుట్‌లో కుంభకోణం

నకిలీ పత్రాలతో ఇళ్ల పట్టాల పంపిణీ

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

కూటమి శ్రేణుల చొరవతో విచారణ చేపట్టిన అధికారులు



బోగస్ పట్టాలపై ఆరా తీస్తున్న అధికారులు, కూటమి శ్రేణులు

ఆచంట, అక్టోబరు 6: గత వైసీపీ ప్రభుత్వంలో పాల్పడిన అవినీతి అక్ర మాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఆచంట మండలం కొడమంచిలిలో నకిలీ పత్రాలతో ఇళ్ల పట్టాలు ఇచ్చి వైసీపీ నాయకులు భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారు. టి.మెరక, చింతలతోట, చిన్నపేటకు సంబంధించి గ్రామానికి సుమారు 319 పట్టాలు మంజూరు అయ్యాయి. టి.మెరక జగనన్న కాలనీలో 129 పట్టాలు మంజూరు కాగా వీటిలో 86 పట్టాలు లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలు ఇచ్చారు. మరో 43 పట్టాలు నకిలీ పత్రాలు సృష్టించి లబ్ధిదారులకు ఇచ్చారు. ఈనెల 43 మందికి సంబంధించి ఒక ఎంజాయ్‌మెంట్ ఫారాలు సృష్టించి స్థానిక అధికారులతో సంతకాలు పెట్టించి దీనిని ఒరిజినల్ పట్టాలుగా లబ్ధిదారులకు అప్పట్లో ఇచ్చారు. లబ్ధిదారుల నుంచి రూ.25 వేల నుంచి 30 వేల వరకు కూడా వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్లు కట్టుకుందామని ఎదరు చూస్తున్న తరుణంలో కూటమి శ్రేణుల దృష్టికి నకిలీ పత్రాల విషయం రావడంతో ఈ సమాచారాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలు మేరకు నలుగురు వీఆర్‌వోలు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు కూటమి శ్రేణులతో కలిసి విచారణ చేపట్టారు. చివరకు 43 పట్టాలు బోగస్ పట్టాలని అధికారులు నిర్ధారణ చేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంలో గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఈ అక్రమ కుంభకోణానికి పాల్పడినట్లు లబ్ధిదారులే చెబుతున్నారు. టి.మెరక జగన్నలేఅవుట్‌లో పక్క గ్రామాలైన పెదమల్లం, కోడేరు, గ్రామాలకు సంబంధించి సుమారు 40 మందికి ఇక్కడ పట్టాలు మంజూరు చేశారు. అయితే ఆ గ్రామానికి చెందిన లబ్ధిదారులు పట్టాలు తీసుకోలేదు. దీన్ని అదునుగా చేసుకుని అధికార పార్టీ నాయకులు 40 పేర్లు గుర్తించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి బోగస్ పట్టాలు జారీ చేసినట్లు సమాచారం. తమకు న్యాయం చేయాలని మోసపోయిన లబ్ధిదారులు కోరుతున్నారు.

డబ్బుల కోసమే చంపేశాడు..

తాడేపల్లిగూడెం మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6 : చెడు వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి ఒంటరిగా జీవిస్తున్న ఓ మహిళ దగ్గర డబ్బులు ఉన్నాయని తెలిసి ఆమెను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఏఎస్పీ భీమారావు ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడెంలోని గాంధిబొమ్మ సెంటర్‌కు చెందిన దరబాల లోవరాజు బంటామేస్త్రిగా పనిచేస్తుంటాడు. చెడు వ్యసనాలకు బానిసై దొరికిన చోటల్లా అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చేందుకు అదే ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళ బొబ్బిలి దేవి (52)ను ఇంటి కాగితాలపై అప్పు అడిగాడు. పత్రాలు తెస్తే డబ్బులు ఇస్తానని దేవి చెప్పడంతో లోవరాజు వెళ్లిపోయాడు.అప్పటికే అదే ఇంటి పత్రాలతో డబ్బులు తెచ్చిన లోవరాజు తనదగ్గర తనఖా పెట్టేందుకు ఏమీ లేకపోవడం, అప్పుల వారి ఒత్తిడి పెరిగిపోవడంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. సెప్టెంబర్ 9న ఆ మహిళ ఇంట్లోకి చొరబడి టవల్‌తో ఆమె పీకకు చుట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఇంట్లో ఉన్న రూ.లక్షా 25 వేల నగదు, చేతికి ఉన్న బంగారు ఉంగరం తీసుకుని వెళ్లిపోయాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సీఐ సుబ్రహ్మణ్యం దర్యాప్తు ప్రారంభించి ఆ ప్రాంతానికే చెందిన లోవరాజును ముద్దాయిగా గుర్తించారు. నిందితుడి నుంచి రూ.లక్షా 3 వేల నగదు, ఉంగరం స్వాధీనం చేసుకున్నారు.

సీసీ కెమెరాలు పట్టించాయి

అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ఆదేశాల మేరకు కేసును లోతుగా దర్యాప్తు చేశారు. దేవి నివాసం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. దేవి హత్యకు ముందు రెండు రోజుల నుంచి లోవరాజు ఆ ప్రాంతంలో ఎక్కువగా తిరగడం గమనించారు.దీనిపై లోవరాజును అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే అసలు నిజాలు బయటపడ్డాయి. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నాగరాజు, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

క్రైమ్ కార్నర్

మందు బిళ్లలకని వెళ్లి శవమై తిరిగి వచ్చాడు


ఆచంట, అక్టోబరు 6: మందు బిళ్లలు తెచ్చుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన పాస్టర్ శవమై తిరిగి వచ్చిన సంఘటన వల్లూరులో చోటు చేసుకుంది. ఆచంట మండలం వల్లూరు పంచాయతీ పరిధిలో మాదాసు వారిపాలెం గ్రామానికి చెందిన దిగుమర్తి లాజర్ (49) 15 సంవత్సరాల నుంచి చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. శనివారం సెంటర్‌కు మందు బిల్లలకు తెచ్చుకోవడానికి వెళ్లి తిరిగి వస్తుండగా వల్లూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో లాజర్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో తణుకు తర్వాత కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్ఐ వెంకట రమణ పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హిజ్రా ఇంట్లో ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి




తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6: తాడేపల్లిగూడెంలోని వీకర్స్ కాలనీకి చెందిన చిన్న లోవరాజు (42) శనివారం రాత్రి హిజ్రాకు చెందిన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీనిపై భార్య సాయి ఫిర్యాదు మేరకు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీకర్స్ కాలనీకి చెందిన లోవరాజు ఆటో నడుపుకుని జీవిస్తుంటాడు. ఏడాదిన్నరగా వార్పు రోడ్డులో ఉన్న ఓ హిజ్రాతో సహజీవనం చేస్తున్నాడు.అయితే మూడు నెలల క్రితం తన భార్యా పిల్లలతో కలిసి ఉండేందుకు వెళ్లగా ఆ హిజ్రా ఆ ఇంటికి వెళ్లి గొడవపడి తనకు సంబంధించిన వస్తువులు ఇచ్చేయాలంటూ గొడవ చేసి పట్టుకు వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు.ఈ క్రమంలో ఆ హిజ్రా ఇంటిలో లోవరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ మృతి చెందడం చెవిపై గాయం కనిపించడం, కాళ్లు నేలకు తగులుతున్నట్టు ఉండటంతో మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నెగ్గిపూడి బ్యాంకు వద్ద కారు బీభత్సం



పెనుమంట్ర, అక్టోబరు 2 :పెనుమంట్ర మండలం మార్టేరు నెగ్గిపూడి బ్యాంకు ప్రాంతంలో కారు బీభత్సం సృష్టించింది. పెనుగొండ నుంచి భీమవరం వెళ్తూ మార్గ మధ్యలో నెగ్గిపూడి బ్యాంకు దగ్గర అదుపు తప్పి వాహనం సుజుకి మోటార్ స్టాల్ వాహనం పైకి దూసుకు వచ్చింది ఆ సమయంలో స్టాల్ నిర్వాహకులు భోజనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది పక్కనే నిలుపుదల చేసిన హైచర్ వాహనాన్ని ఢీకొనడంతో కారు మొదట భాగం నుజ్జునుజ్జయింది. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు మద్యం తాగి డ్రైవింగ్ చేయడంతో కారు అదుపు తప్పిందని సంఘటన ప్రాంతంలో ఉన్న వారు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కొత్త మోటర్ వాహనాలు దెబ్బతిన్నాయి. మద్యం మత్తులో ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి పెనుమంట్ర మండలం భట్ల మగుటూరు వద్ద కారు అదుపుతప్పివంట బోదెలోకి దూసుకు వెళ్ళింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షంగా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు

అనకాపల్లిలో ప్రమాదం..ఆర్టీసీ బస్ డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్

యలమంచిలి/నరసాపురం, అక్టోబరు 6: ఆదివారం తెల్లవారుజామున అనకాపల్లి వద్ద నరసాపురం నుంచి విశాఖ వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ జగన్ మోహన్ (50) మృతిచెందాడు. బస్సులో 30 మంది ప్రయాణిస్తుండగా ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్‌ది యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామం. నరసాపురం డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న జగన్మోహనరావు శనివారం డ్యూటీకి వెళ్లాడు. డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగి రావాల్సిన అతను విగత జీవుడై రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు సిరిదీప్ డ్రైవర్‌గా, రెండో కుమారుడు పవన్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగిగా హైద రాబాద్‌లో పని చేస్తున్నారు.

సింగిల్ డ్రైవింగ్ వల్లే ప్రమాదమా...?

డ్రైవింగ్‌లో జగన్‌మోహన్‌కు ఎంతో అనుభవం ఉంది. ఎక్కువగా హైద్రాబాద్, విశాఖ వెళ్లుతుంటారు. ఇంత సీనియర్ ఉద్యోగి ప్రమాదానికి గురై చనిపోవడంపై భిన్నవాదనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో విశాఖకు ఇద్దరు డ్రైవర్లు వెళ్లేవారు. ఒకరు టిక్కెట్లు కొడుతుంటే మరొకరు నడిపేవారు. ఇలా గమ్యస్థానం వెళ్లే వరకు డ్రైవర్లు ఇద్దరు మారుతూ ఉండేవారు. దీని వల్ల ప్రమాదాలకు అస్కారం ఉండేది కాదు. కొంతకాలం నుంచి దూర ప్రాంతాలకు సింగిల్ డ్రైవర్‌నే పంపిస్తున్నారు. నరసాపురం నుంచి విశాఖకు 250 కిలోమీటర్లు. ఎనిమిది గంటలు ప్రయాణం. ఇంత దూరం సింగిల్ డ్రైవర్ నడపడం వల్ల రాత్రి సమయాల్లో నిద్రమత్తు అవకాశం ఉంది. ఇలాంటి సమయాల్లో ప్రమాదాలే జరిగే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అనారోగ్యం తట్టుకోలేక ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 6 : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి కిడ్నీల్లో కూడా ఇన్‌ఫెక్షన్ ఉందని వైద్యుడు చెప్పడంతో జీవితంపై విరక్తి చెంది అధిక మోతాదులో బీపీ బిళ్లలను వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి చెందిన తెనాలి సంగీతరావు (58)కి పదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో అప్పటి నుంచి మందులను వాడుతున్నాడు. పిల్లలు ఇచ్చే డబ్బులతో జీవిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో వైద్యుని వద్దకు వెళ్ళగా కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ ఉందని మందులు వాడాలని సూచించారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సంగీతరావు తను వాడే బీపీ బిళ్ళను అధిక మోతాదులో వేసుకుని అస్వస్థతకు గురయ్యాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు.

విజిలెన్సు దాడులు .. రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం, అక్టోబరు 6 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరాంబాబుకు అందిన సమాచారంతో విస్తృతంగా విజిలెన్సు అధికారులు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఇరగవరం మండలం ఈస్టు విప్పర్రులో ఒక షెడ్డులో 11 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని సమయం సతీష్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచాడు. అతను చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కిలో 22 రూపాయలకు కొనుగోలు చేసి తిరిగి కోళ్ళఫారాలకు 25 రూపాయలు విక్రయిస్తున్నట్లుగా అంగీకరించాడు. మొత్తం 44 వేల రూపాయల విలువైన బియ్యాన్ని సీజ్ చేశారు. కామవరపుకోట మండలం పశువుల ఆసుపత్రి వద్ద ఆటోను ఆపి తనిఖీలు నిర్వహించగా ఏడున్నర క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న కాట్రు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కోడూరు కాశీ ఫణి కుమార్‌కు చెందినవని టి.నర్సాపురం మండలం అల్లంచెర్ల, కొత్తగూడెం పరిసర గ్రామాల్లో షేక్ లాల్‌జాన్ బాషా అనే వ్యక్తి కొనుగోలు చేసి తూర్పు యడవల్లి గ్రామానికి చెందిన టి.శ్రీకాంత్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నాడని చెప్పారు. దీంతో వారందరిపై కేసు నమోదు చేశారు. 30 వేల రూపాయలు విలువైన రేషన్ బియ్యం, లక్ష రూపాయల ఆటోను సీజ్ చేశారు. కామవరపుకోట గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించగా ఐసర్ వ్యానులో 170 క్వింటాళ్ళ రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లుగా గుర్తించారు. వ్యాను డ్రైవర్ కోనా సాయికుమార్‌ను ప్రశ్నించగా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్‌కు చెందినవని వాటిని కె.జగ్గవరం పరిసర గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మడానికి వెళ్తున్నాని చెప్పాడు. ఆ బియ్యం విలువ ఆరు లక్షల 80 వేల రూపాయలు అని వ్యాను విలువ 15 లక్షలు అని మొత్తం 21 లక్షల 80 వేల రూపాయలు సీజ్ చేశామన్నారు. విజిలెన్సు ఎస్ఐ రంజిత్‌కుమార్, రెవెన్యూ పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నాయకులపై కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 6 : తమ కళాశాలకు అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యానికి పాల్పడి ఫర్నీచర్, రికార్డులను ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో విద్యార్థి సంఘ నాయకులపై కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన చేబోయిన అచ్యుత్‌కు పాత సర్టిఫికెట్ ఇవ్వకుండా వైష్ణవి కళాశాల యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయడంతో అచ్యుత్ ఆ కాలేజీలోనే ఈనెల 5వ తేదీన పురుగు మందు తాగాడు. ఈ సమాచారం అందుకున్న పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎం నాగవెంకట సన్యాసిరావు, ఏలూరు టౌన్ అధ్యక్షుడు క్రాంతికుమార్, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నాగవెంకట శివరావులు కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. వీరు అక్రమంగా ప్రవేశించి ఫర్నీచర్‌ను, కాలేజీ రికార్డులను ధ్వంసం చేశారని కళాశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.